
సాక్షి సంగారెడ్డి

గురువారం ι 28 ι నవంబర్ ι 2024



విద్యార్థులకు 'పరీక్ష'

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు విషయంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

వివరాలు 8లో ▸



చలిగాలి జాగ్రత్తగా మెలగాలి..

కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తూ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఇబ్బందులూ తలెత్తవని వైద్యనిపుణులు సలహాలిస్తున్నారు.

వివరాలు 9లో ▸



మధ్యాహ్న భోజనం పరిశీలన

గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో మండల అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బడుగు వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



పూలె విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పేర్కొన్నారు. ఈనెల 28న పూలే వర్ధంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఆయన విగ్రహానికి కాలనీ వాసులతో కలసి ఎమ్మెల్యే ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వార్డు అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీనిచ్చారు. బీరయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, అన్వర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించిన ఆర్డీవో



జేఎన్‌టీయూలో సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు

సంగారెడ్డి: అందోల్ డివిజన్‌కు సంబంధించిన సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఆర్డీవో పాండు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ సర్వే ఆధారంగానే కుటుంబ స్థితిగతులు ఆధారపడి ఉంటాయని చెప్పారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య యాదవ్



కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న లక్ష్మయ్య యాదవ్ గతంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ...ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణపై, పేదలకు ఉచిత విద్య అందేవరకూ పోరాడతానని తెలిపారు.


బళ్లారి బ్యాలెట్ బాక్సులు

- పంచాయతీ ఎన్నికల కోసం ముందస్తు సన్నాహాలు
- కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాటు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు తాజాగా ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను తెప్పించారు. కర్ణాటకలోని బళ్లారి జిల్లా నుంచి 783 బాక్సులు జిల్లాకు వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో 3,285 బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవి సరిపోయే అవకాశం లేకపోవడంతో బళ్లారి నుంచి మరిన్ని తెప్పించారు. అలాగే జిల్లాలో ఉన్న బాక్సులకు అవసరమైన వాటికి మరమ్మతులు కూడా చేయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుల సమగ్ర సర్వే చివరి దశకు చేరుకుంది. ఈ సర్వే నివేదిక వచ్చాక ఆయా సర్పంచ్, వార్డులకు రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. రెండు, మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలుండటంతో జిల్లా అధికార యంత్రాంగం ఈ ఏర్పాట్లలో నిమగ్నమైంది.

పెరగనున్న పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో మొత్తం 646 గ్రామపంచాయతీలు ఉండగా, వీటి పరిధిలో 5,710 వార్డులు ఉన్నాయి. కాగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే ఈ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక పోలింగ్ కేంద్రం తప్పనిసరిగా మారింది. పెద్ద గ్రామ పంచాయతీల్లో అదనపు (యాగ్జిలరీ) పోలింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పంచాయతీ అధికారులు భావిస్తున్నారు. అదనపు పోలింగ్ కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై గ్రామాల్లో ప్రభుత్వ భవనాలను గుర్తిస్తున్నారు.



పోలింగ్ సిబ్బంది గుర్తింపు...

పంచాయతీ పోరుకు సంబంధించిన పోలింగ్ సిబ్బందిని ఎన్నికల అధికారులు గుర్తిస్తున్నారు. రిటర్నింగ్ అధికారులు స్టేజ్-1, స్టేజ్-2 స్థాయి నుంచి పోలింగ్ సిబ్బంది వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు అవసరమైన ఉద్యోగుల వివరాలను ఇప్పటికే సేకరించారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ నుంచి లెక్చరర్ స్థాయివరకు ఈ ఎన్నికల విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పోలింగ్, ఫలితాలు ఒకే రోజు ప్రకటించాల్సి ఉండటంతో అవసరమైన అధికారులను సిబ్బందిని గుర్తించారు. ఈ మొత్తం ప్రక్రియకు సుమారు 5,365 మంది పోలింగ్ విధులకు అవసరమని అధికారులు తెల్పారు.

ముందస్తు చర్యలు చేపట్టాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్యాలెట్ బాక్సులు తగినన్ని లేకపోవడంతో ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఈ బాక్సులను పంపారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న బాక్సులకు అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నాము. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని కూడా గుర్తించాము. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తే అప్పుడు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

-సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి



సంగారెడ్డి పట్టణంలో ఇసుకపై కనీసం కవర్లను కూడా కప్పకుండా తరలిస్తుండటంతో వెనుక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బుధవారం ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా 'సాక్షి' కంటికి చిక్కిన చిత్రం ఇది. - సంగారెడ్డిటౌన్

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

తెల్లాపూర్ చెరువులను సందర్శించిన హైడ్రా చైర్మన్



రాజుయాదవ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రంగనాథ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెరువుల పరిరక్షణ మన అందరి బాధ్యతని హైడ్రా చైర్మన్ రంగనాథ్ పేర్కొన్నారు. తెల్లాపూర్ పరిధిలోని వనం చెరువు, మేళ్ల చెరువు, చెల్లికుంటాలను బుధవారం ఆయన సందర్శించారు. మేళ్ల చెరువు కట్టపై ఆయన నడిచి చెరువు, కాలువలను నిశితంగా పరిశీలించారు. మేళ్ల చెరువును ఆనుకుని ఉన్న రాజుయాదవ్ వ్యవసాయక్షేత్రాన్ని కూడా ఆయన సందర్శించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూమిలో మట్టిని ఎలా నింపుతారని నిలదీశారు. అక్కడే ఉన్న రాజు యాదవ్ స్పందిస్తూ...తనకు ఎన్‌వోసీ ఉందని, గత కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నానని వివరించారు. వెంటనే ఇరిగేషన్ డీఈ రామస్వామి కల్పించుకుంటూ ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇదివరకే ఆ అనుమతులను రద్దు చేసినట్లు రంగనాథ్‌కు వివరించారు. దీంతో రంగనాథ్ స్పందిస్తూ...దీనిపై అధికారులనుంచి పూర్తి నివేదిక తెప్పించుకుంటానని, మీ అనుమతులు తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చెల్లికుంటాను సందర్శించారు. చెరువు కట్ట, అలుగులను పరిశీలించారు. రంగనాథ్‌కు చెరువులు ఏవిధంగా కబ్జాకు గురయ్యాయో మాజీ నీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింహ వివరించారు. తెల్లాపూర్‌లోని చెరువులు హెచ్‌ఎండీఏ వైబ్‌సైట్‌లో కనిపించడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ...ఎఫ్‌టీఎల్ పరిధులను త్వరలోనే నిర్ణయిస్తామని, అన్ని చెరువులు ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనమే వడ్డించాలి

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి



విద్యార్థులకు వడ్డించే అన్నం పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి

ఝరాసంగం(జహీరాబాద్): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి ఆదేశించారు. మండల కేంద్రమైన ఝరాసంగం మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతోపాటు దిగ్వాల్లో ఉన్న ఝరాసంగం వసతిగృహాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంతోపాటు కిచెన్ పరిసరాలు, కూరగాయలు నిల్వ ఉంచే ప్రదేశాలను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించేందుకు అవసరమయ్యే సామగ్రిని ఎప్పటికప్పుడు తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా సంక్షేమ చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

మెట్రోను ఇస్నాపూర్ వరకు పొడిగించాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: మెట్రో రైలు సేవల్ని ఇస్నాపూర్ వరకు పొడిగించాలని సీపీఎం పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఇస్నాపూర్‌లో సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ప్రజల నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ...సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు సౌకర్యం కోసం మెట్రో రైలు పొడిగించాలని లింగంపల్లి నుంచి సంగారెడ్డి వరకు మహాపాదయాత్ర కార్యక్రమం చేసినట్లు గుర్తు చేశారు. మహాసభల జయప్రదం కోసం ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు.

ఉపాధి కోసమే 'మై భారత్ పోర్టల్'



పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్న రంజిత్‌రెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు 18 నుంచి 29 ఏళ్ల యువత కోసం కేంద్ర ప్రభుత్వం మై భారత్ పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించిందని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎ స్.రత్నప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం 'మై భారత్ పోర్టల్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఎస్.రత్నప్రసాద్ మాట్లాడుతూ...యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలు, సాధించిన విజయాలు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, ఉపాధి, ప్రభుత్వ పథకాలు పొందే అవకాశముంటుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ నియామకాలు, ప్రైవేటు సంస్థల్లో చేపట్టే ఉద్యోగ నియామకాలు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వివరాల ఆధారంగానే లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ కుమార్, డాక్టర్ జోత్స్న ఇతర అధ్యాపక బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు రంజిత్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ ఫైళ్లు మాయం

- ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ
- కొమురవెల్లి మల్లన్న ఆలయంలో వెలుగులోకి..



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో వివిధ విభాగాలకు సంబంధించిన ఆడిట్ ఫైళ్లు మాయమయ్యాయి. ఈ క్రమంలో గతంలో ఇక్కడ పని చేసిన ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. 2014 ఏప్రిల్ నుంచి మార్చి 2017 వరకు చేపట్టిన ఆలయ ఆదాయ వ్యయాలపై గతంలో ఆడిట్ నిర్వహించారు. సుమారు రూ.3కోట్ల మేర లావాదేవిలపై ఆడిట్ అభ్యంతరాలు ఉన్నట్లు వ్యక్తం చేశారు. దీంతో 2018లో అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ 2014 ఏప్రిల్ నుంచి మార్చి 2017 వరకు పని చేసిన ఆలయ ఈవోలు, పలువురు ఉద్యోగులకు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేయడంతో కొంత మేరకు మెజర్మెంట్ బుక్‌లు, బిల్లులు సమర్పించారు. ఇంకా రూ.కోటి కిపైగా ఆడిట్ అభ్యంతరాలకు ఎలాంటివి చూపలేదు. అయితే ఇటీవల అధికారులు రికార్డుల పరిశీలనలో ఫైళ్లు మాయమైన విషయం గుర్తించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు నీల శేఖర్, జగన్, నర్సింహులుకు నోటీసులు జారీ చేశారు. ఆడిట్‌కు సంబంధించిన ఫైళ్లు దేవాలయంలో అందుబాటులో లేవని వెంటనే అందించాలని, లేనట్లయితే శాఖా పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.

ప్రజారోగ్య సంక్షేమ కరదీపిక విడుదల

సంగారెడ్డి జోన్: ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారులకు సంబంధించిన కరదీపికను కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన కుటుంబ సంక్షేమం, జాతీయ ఆరోగ్య మిషన్, జనని సురక్ష యోజన, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సేవలు, ఆహారం, ఆరోగ్యం, ఎయిడ్స్ వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ప్రథమ చికిత్స, యోగ వంటి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గాయత్రిదేవి, డాక్టర్ శశాంక్, ఎం.ప్రసాద్, రవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలు భేష్

- యూపీఎస్సీ ట్రైనీ అధికారుల బృందం
- ఐదు రోజులపాటు గ్రామంలో పర్యటించిన ట్రైనీ అధికారులు



గ్రామంలో ఎడ్ల బండిపై యూపీఎస్సీ ట్రైనీ అధికార బృందం

పటాన్‌చెరు టౌన్: క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల పనితీరు భేష్ అని యూపీఎస్సీ ట్రైనీ అధికార బృందం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆర్థిక స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాల తీరును తెలుసుకునేందుకు ట్రైనీ బృందం ఈ నెల 23 నుంచి ఐదురోజులపాటు నందిగామ గ్రామంలో పర్యటించింది. గ్రామస్తులు జీవనోపాధి ఎలా పొందుతున్నారు? వారి ఆదాయ మార్గాలు ఏంటి వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. వైకుంఠధామం, నర్సరీలను పరిశీలించారు. వీరి పర్యటనలో చివరిరోజైన బుధవారం ట్రైనీ అధికారులు సరదాగా ఎడ్ల బండి ఎక్కి కొద్దిసేపు సందడి చేశారు. అనంతరం ట్రైనీ అధికార బృందాన్ని గ్రామపంచాయతీ, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

పల్లెకు పోదాం... పాలన చూద్దాం!

- జిల్లాలో 29 మంది సివిల్స్ ట్రైనీ అధికారుల పర్యటన
- ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలపై అధ్యయనం

సంగారెడ్డి జోన్: జిల్లావ్యాప్తంగా సివిల్స్ ట్రైనీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు పనితీరుపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ పొందుతున్న అధికారులు గ్రామాల బాట పట్టారు. గ్రామీణ వాతావరణంతో పాటు అక్కడి ప్రజలు లబ్ధిపొందుతున్న పథకాలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నారు. గ్రామంలో తిరుగుతూ ప్రభుత్వాలు చేపట్టిన పనులను రోజువారీగా ప్రణాళికబద్ధంగా పరిశీలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు, ప్రజలు జీవన స్థితిగతులు, జీవన శైలిపై అధ్యయనం చేస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో వీరు నేర్చుకుంటున్న అంశాలతో పాటుగా ఈ ఉద్యోగాలను ఎలా సాధించారో 'సాక్షి'తో వివరిస్తూ యువతకు స్ఫూర్తి నింపారు.

ప్రతీ ఐదుమంది ఒక టీమ్‌గా...

సివిల్స్‌కు ఎంపికైన 29 మంది శిక్షణలో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్నారు. జిల్లాలోని కొండాపూర్ మండల పరిధిలోని మల్లెపల్లి, సదాశివపేట పరిధిలోని వెల్టూర్, పటాన్‌చెరు పరిధిలోని నందిగామ, గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం, జిన్నారం మండల పరిధిలోని కొడకంచ, పుల్కల్ మండల పరిధిలోని శివంపేట గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఐదుమంది బృందంగా, ఒక గ్రామంలో నలుగురు ఓ బృందంగా ఏర్పడి పర్యటిస్తున్నారు.

పథకాల అమలు–సమస్యలపై...

బృంద సభ్యులు ఆయా గ్రామాల్లో శాఖల వారీగా పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా, వాటిని పొందడంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలతో ఆర్థికంగా ఎదిగేందుకు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు? తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేందుకు వీరి ఆదాయ మార్గాలు ఏంటి? రుణాలు తీర్చే విధానం వంటి అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. పాఠశాలలను సందర్శించి తరగతి గదులు, క్రీడా మైదానాలు, మరుగుదొడ్లు,పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా ఉన్నాయా లేదా, ఉపాధ్యాయులు ఉన్నారా లేదా అని విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుంటున్నారు. రైతులు పంటలు సాగు చేస్తున్న విధానంతోపాటు వచ్చే లాభాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి తెలుసుకుంటున్నారు. అధ్యయనం చేసిన వివరాలు, సమస్యలు నమోదు చేసుకుంటున్నారు.



కొండాపూర్ మండలంలోని మల్లెపల్లి గ్రామస్తులతో ట్రైనీ అధికారులు

రెండో ప్రయత్నంలోనే ఎంపికయ్యా



సివిల్స్ సాధించాలని పట్టుదలతో చదివి రెండో ప్రయత్నంలోనే ఎంపికయ్యా. మాది రాజస్థాన్. మధ్యప్రదేశ్‌లో పోస్టింగ్ కల్పించారు. ట్రైనీలో భాగంగా మూడు రోజులుగా గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మహిళా సంఘాల గ్రూపులు, విద్యావ్యవస్థ, రైతులతోపాటు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాను. ఆయా కేంద్రాలలో అందిస్తున్న సేవలను తెలుసుకున్నాను. వివిధ పథకాల ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందుతున్నారో మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నాను. పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతోపాటు కంప్యూటర్ విద్య కూడా అవసరమని గుర్తించాను.

అంకుష్ మంగల్, ఐఆర్ఎస్, 2021 బ్యాచ్, రాజస్థాన్

ఉపాధ్యాయురాలి స్ఫూర్తితో....



నేను చదువుకునే సమయంలో ఆర్థిక శాస్త్రంపై నాకున్న ఇష్టం మేరకు ఉపాధ్యాయుల్లో ఒక ఉపాధ్యాయురాలి సహకారంతో సివిల్ సర్వీసెస్ గురించి తెలుసుకున్నాను. దీంతో ఐఈఎస్ కావాలనుకున్నా. మాది జార్ఖండ్ రాష్ట్రం. రెండో ప్రయత్నంలో ఎంపికయ్యాను. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు నావంతు కృషి చేస్తాను. గ్రామంలో పర్యటిస్తూ ప్రజల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నా. ప్రజాభివృద్ధికి స్థానిక అధికారులు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారు.

-అదితి రుహా, ఐఈఎస్, 2024 బ్యాచ్, జార్ఖండ్

పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తూ....



నేను పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ఎంపికయ్యాను. మాది పశ్చిమబెంగాల్. రైతు కుటుంబం నుంచి వచ్చాను. చదువుకునేందుకు అధిక ప్రాధాన్యతనిస్తాను. ఉద్యోగం వచ్చినా సివిల్స్‌కు ఎంపిక కావాలనే పట్టుదలతో చదువుకున్నా. ప్రస్తుతం శిక్షణలో భాగంగా అన్నారం గ్రామంలో పర్యటిస్తున్నా. మహిళల్లో చైతన్యం వచ్చి, ప్రభుత్వం, అధికారుల ప్రోత్సాహంతో మహిళా సాధికరత వైపు అడుగులు వేస్తున్నారు. మార్కెట్‌లో అధికంగా మహిళలే కూరగాయలను విక్రయించటం గమనించాను.

-దేబ్రాత్ సాహా, ఐఎస్ఎస్, 2024 బ్యాచ్, పశ్చిమబెంగాల్

రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తూనే



ఇండియన్ రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తూనే ఆరో ప్రయత్నంలో సివిల్స్ సాధించా. మాది తమిళనాడు రాష్ట్రం. మధ్యప్రదేశ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. గత మూడు రోజులుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతోపాటు ప్రజా సమస్యలను తెలుసుకున్నాను. ఇక్కడ ప్రదేశంలో ఎక్కువగా పత్తి పంటతోపాటు వరి పంటను సాగు చేస్తున్నారు. నీటి సౌకర్యం ఉండటంతో వీటితో పాటు కూరగాయల పంటను సైతం సాగు చేసుకునే అంశాన్ని గుర్తించాను.

మేనక.వి, ఐఎఫ్ఓఎస్, 2022 బ్యాచ్, తమిళనాడు

మొదటి ప్రయత్నంలోనే సాధించా



ప్రజా సేవ చేసేందుకు మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ ఉద్యోగం సాధించా. మాది ఉత్తరాఖండ్. ఉత్తరప్రదేశ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. మా నాన్న సూచన మేరకు సివిల్స్ సాధించాను. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు శిక్షణలో తెలుసుకున్నాను. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో అమలు చేస్తున్న తీరుతోపాటు చాలా విషయాలను తెలుసుకున్నాను. కాలుష్యం తగ్గించేందుకు అవసరమయ్యే చర్యలు గుర్తించాను. వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చిన వలస కార్మికుల జీవనస్థితిగతులు, వారి పిల్లల విద్య వంటి అంశాలను తెలుసుకున్నాము.

సచిన్ చౌబే, ఐపీఓఎస్, 2021 బ్యాచ్, ఉత్తరాఖండ్

క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



వర్గల్ ఎమ్మార్సీ వద్ద తెలుపుతున్న యాదగిరి తదితరులు

వర్గల్(గజ్వేల్): సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో బుధవారం వర్గల్ మండల వనరుల కేంద్రం వద్ద ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, తమ డిమాండ్లు ఆమోదించి తక్షణమే పేస్కేల్ వర్తింపజేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి కోరారు. లేనిపక్షంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు డిసెంబర్ మొదటి వారంలో సమ్మెకు దిగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నవీన్ కుమార్, సంఘ ప్రతినిధులు కరుణాకర్, భూపాల్, బలరాం పాల్గొన్నారు.

పత్తికి క్వింటాలుకు రూ.10 వేలు ఇవ్వాలి



మారేపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు

కొండాపూర్(సంగారెడ్డి): పత్తికి క్వింటాలుకు మద్దతు ధర రూ 10 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో పలు గ్రామాలలో సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిని ఎక్కువగా దళారులే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐ క్వింటాలు పత్తికి రూ.7,400 ఇస్తామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పడమే తప్పా ఎక్కడా కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజయ్య మండల కమిటీ సభ్యులు బాబురావు, పుల్లయ్య, కిషన్, పెద్దాపురం రాజు, మాణయ్య, అనంతరావు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య యాదవ్



నారాయణఖేడ్: తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మర్పల్లి లక్ష్మయ్య యాదవ్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మయ్య యాదవ్ గతంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా లక్ష్మయ్య ఎన్నిక పట్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావు, విఠల్, గోవింద్, కార్యదర్శులు మహేశ్వర్‌రావు, డివిజన్‌నాయకులు వెంకట్‌రాథోడ్, కిషన్‌రావు, ఎండీ ఆదం, దీపక్ హర్షం వ్యక్తం చేశారు.

కొండచిలువ కలకలం



బేగంపేటలో కొండచిలువ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో గల ఆనందయ్య స్వామి మఠం వెనుక వైపున బుధవారం కొండ చిలువ కనపడటంతో కలకలం నెలకొంది. గతంలో బెజ్జంకి, గాగిళ్లాపూర్, లక్ష్మీపూర్, వడ్లూరు గ్రామాలలో కొండ చిలువలు కనిపించాయి. ఈరోజు బేగంపేటలో కొండచిలువ కనబడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటి నివారణ కోసం అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష

- పాత నిబంధనలతో పరేషాన్
- అందని పదో తరగతి ఫీజు మాఫీ..
- జిల్లాలో 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు

కేటగిరీల వారీగా విద్యార్థుల వివరాలు

కేటగిరీ	బాలురు	బాలికలు	మొత్తం
జనరల్	314	314	628
ఎస్సీ	842	1,019	1,861
ఎస్టీ	751	791	1,542
ఓబీసీ	3,365	3,368	6,733
మొత్తం	5,272	5,492	10,764



కొల్చారం మండలం రంగంపేట జెడ్పీ హైస్కూల్

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు విషయంలో పాఠశాల విద్యాశాఖ పాత నిబంధనలే అమలు చేస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 45 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులే ఉన్నారు. ఎప్పుడో ఏళ్ల క్రితం విద్యాశాఖ రూపొందించిన నిబంధనలు సవరించకపోవడంతో జిల్లాలో పదో తరగతి చదువుతున్న 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష ఫీజు మాఫీ పొందలేకపోతున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విద్యాశాఖ తమ నిబంధనలు సవరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాలో 192 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 38 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 230 ఉన్నాయి. ఇందులో బాలికలు 5,495, బాలురు 5,269 కలిపి మొత్తం 10,764 మంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం

ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత ప్రజలకు రూ. 2 లక్షల చొప్పున ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నారు. ఇంతకు తగ్గించి ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నట్లు సమాచారం. విద్యాశాఖలో మాత్రం ఇంకా రూ. 20 వేలు, రూ. 24 వేలు నిబంధన అమలులో ఉండడంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించే ఫీజు మాఫీ అందకుండా పోతుంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాలకు వెళితే సర్టిఫికెట్లకు రూ.150 వరకు ఖర్చు అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నట్లు సమాచారం.

ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు..

ఈ విద్యా సంవత్సరం (2024– 25) పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించే షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే విడుదల చేసింది. ఎలాంటి ఫైన్ లేకుండా ఈనెల 28వ తేదీ వరకు చెల్లించవచ్చునని తెలిపారు. రూ. 50 జరిమానతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ. 200 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు, రూ.500తో డిసెంబర్ 30వ తేదీ వరకు చెల్లించే అవకాశం కల్పించింది. దీంతో విద్యార్థులంతా ఫీజు చెల్లించే పనిలో ఉన్నారు.

నిబంధనలు సవరించాలి



విద్యాశాఖ ఎన్నో ఏళ్ల క్రితం తయారు చేసిన నిబంధనలనే పాటించడంతో 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వ సాయం అందకుండా పోతుంది. ప్రస్తుత కాలానుగుణంగా విద్యాశాఖ నిబంధనలు సవరించి పదో తరగతి పరీక్ష ఫీజు మాఫీ అందించాలి.

– బాల్‌రాజ్, దళిత సంఘాల నాయకుడు, మెదక్



మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ తదితరులు

హెడ్‌కానిస్టేబుల్ కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతున్న వీరప్ప
- ఎస్పీ, ఇతర పోలీసు అధికారుల నివాళి



వీరప్ప (ఫైల్)

రేగోడ్(మెదక్)/పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రేగోడ్ గ్రామానికి చెందిన నాగప్పగారి వీరప్ప అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన కుటుంబాన్ని మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ విశ్వప్రసాద్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాఖ పరమైన నగదును భార్య బుజ్జమ్మకి అందజేశారు. వీరన్నకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు నరేష్ పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా, చిన్న కుమారుడు ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగిగా ఉన్నాడు. వీరన్నకు జానపద కళలు, నాటకాలంటే అమితమైన ప్రేమ. పలు పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. కాగా, వీరప్ప ఆకస్మిక మృతితో పాపన్నపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ట్రాన్స్ జెండర్లకు న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ హితవు



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్: ట్రాన్స్ జెండర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలో ట్రాన్స్ జెండర్లకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి, ఆరోగ్య సంరక్షణ పొందే సౌకర్యాలు వంటి వాటి గురించి తెలియజేశారు. న్యాయ సహాయం కొరకు జిల్లా కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ఊపిరి పోసి..

- యువకుడిని కాపాడిన కానిస్టేబుల్
- ప్రస్తుతం నిలకడగానే ఆరోగ్యం
- సీపీ, ఏసీపీ అభినందనలు



కానిస్టేబుల్ లింగం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడికి ఓ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉంది. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒకరి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను పోలీసు కమిషనర్, ఏసీపీ సహా పలువురు అభినందించారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన వంటేరు సందీప్‌రెడ్డి(32) రెండేళ్లుగా ఫ్యామిలీ రెస్టారెంట్ నడుపుతున్నాడు. అయితే.. అంతగా నడవకపోవడంతో కొన్ని నెలల క్రితం రెస్టారెంట్‌ను మూసేశాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తండ్రి సత్యనారాయణరెడ్డితో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో తాను చనిపోతున్నానని చెప్పిన సందీప్‌రెడ్డి ఇంట్లో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంటనే ఊర్లనే ఉంటున్న కూతురుకు సమాచారం అందించాడు. హతాశులైన ఆమె ఏడ్చుకుంటూ తమ్ముడి ఇంటి వైపు వెళుతోంది. ఆ సమయంలో జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బ్లూకోట్ కానిస్టేబుల్ లింగం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎక్కడకు వెళుతున్నారు.. ఎందుకు ఏడ్చుతున్నారని ఆరాతీశాడు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్.. వెంటనే వారితో కలసి సందీప్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. గది తలుపులు పగులగొట్టి వేలాడుతున్న అతడిని కిందకు దించాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కానిస్టేబుల్ సీపీఆర్ చేశాడు. స్పృహ రాగానే, స్థానిక వైద్యుడి సహకారంతో వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సీపీఆర్ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లింగంను సీపీ అనురాధ, ఏసీపీ పురుషోత్తం అభినందించారు. అలాగే సందీప్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కష్టించి కొలువు కొట్టారు

తొలి ప్రయత్నంలోనే యూనిఫామ్ ఉద్యోగం

సంగారెడ్డి క్రైమ్: 'పట్టుదలతో చేస్తే సమరం తప్పకుండా నీదే విజయం పదరా సోదరా'అనే పాట ఈ యువకుల్లో స్ఫూర్తి మంత్రం నింపిందేమో తెలియదు కానీ లక్ష్యసాధనలో మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టు సడలించకుండా గురిచూసి లక్ష్యాన్ని ఛేదించారు. బలమైన సంకల్పం ముందు విధికూడా తలవంచుతుందని నిరూపించారు. పోలీసు కొలువు సాధించాలన్న కలని సాకారం చేసుకునేందుకు ప్రణాళికతో కష్టించి ఆ కొలువు యూనిఫామ్‌ను ఒంటిపైకి రప్పించుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనుకుని పోలీసు వృత్తిని ఎంచుకుని ఆ ఉద్యోగాన్ని సాధించాలన్న స్వప్నానికి రెక్కలు తొడిగి తమ కలని నిజం చేసుకున్నారు. ఇలా కానిస్టేబుల్ కొలువు సాధించిన వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కుటుంబ నేపథ్యం. ఒకరిది నిరుపేద కుటుంబం కాగా మరొకరిది వ్యవసాయ కుటుంబం. లక్షల మంది రాసిన పోటీ పరీక్షలో నిలిచి గెలిచారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన దాదాపు 20 నుంచి 25 మంది యువతీ యువకులు పోలీస్ నియామక పరీక్షల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఈనెల 30 నుంచి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో విధులో చేరనున్నారు. తాము ఎలా సన్నద్ధమైందీ, ఏ విధంగా ఉద్యోగాన్ని సాధించారనే అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఎస్సై కావాలనుకుని...



నా పేరు నవీన్ యాదవ్. మాది సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంట. మాది వ్యవసాయ కుటుంబం. నేను బీటెక్ చదువుతుండగా, ఎస్సై, కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించాను. తొలి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటలు వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు గ్రౌండ్‌లో శారీరకంగా వ్యాయామం చేసేవాడిని. మిగతా సమయంలో ప్రణాళికతో మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేశాను. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే విజయం సాధించడం కష్టమేమీ కాదు. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగి కావడం ఆనందంగా ఉంది. మొదటి పోస్టింగ్ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చారు.

గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతుండగా...



నా పేరు షేక్ ఇర్ఫాన్. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్. అమ్మ నాన్నలు ఎంతో శ్రమించి మమ్మల్ని చదివించారు. నేను డిగ్రీ చదివాక, గ్రూప్స్ సిద్ధమవుతుండగా నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో నేను ప్రయత్నించాను. తొలి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించా. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే చదువుకున్నాను. అర్థమేటిక్, రీజనింగ్ టెస్ట్ మోడల్ పేపర్లు రోజుకు నాలుగు గంటలు ప్రాక్టీస్ చేసేవాడిని. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటలపాటు గ్రౌండ్‌లో శారీరకంగా వ్యాయామం చేసేవాడిని. నా మొదటి పోస్టింగ్ నారాయణఖేడ్ మండలం కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చారు.

వంతెనను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి



రాజశేఖర్(ఫైల్)



శివరాజ్(ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): వంతెనను ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి–నాందెడ్ అకోలా రహదారి161 హైవేపై అల్లాదుర్గంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ బోధన్‌కు చెందిన దేశముఖ రాజశేఖర్ తన తండ్రి శివరాజ్, తల్లి లక్ష్మిబాయి, భార్య అరుణ వారి కూతురు అనన్యలు కలిసి హైదరాబాద్ నుంచి బోధన్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అల్లాదుర్గం హైవేపై అతివేగంతో ఉన్న వారి కారు అదుపు తప్పి వంతెనను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని జోగిపేట, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజశేఖర్ మరణించగా, అలాగే.. సంగారెడ్డిలో శివరాజ్ తుదిశ్వాస విడిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

రామాయంపేట(మెదక్): రామాయంపేట శివారులోని కామారెడ్డి బైపాస్ రోడ్డు మలుపు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేట వైపు నుంచి కామారెడ్డి వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బీహార్‌కు చెందిన బహదూర్, దీపక్, అక్కులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం



వడ్డేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

దుబ్బాకటౌన్: ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని, దేశవ్యాప్తంగా ఈ పంటకు భారీ డిమాండ్ ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ పంటలను, వడ్డేపల్లి గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌లో నీటి యాజమాన్యాన్ని సరైన పద్ధతిలో పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పామాయిల్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమవుతుందని సూచించారు. మొక్క 30 నెలలు వయస్సు వచ్చేవరకు లేత దశలో మగ, ఆడ పుష్పాలను తప్పనిసరిగా తొలగించాలన్నారు. 36 నెలల వయస్సులో గెలల బరువు బాగా వస్తుందన్నారు. ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చన్నారు. ఆయిల్ ఫామ్ తోటలో మూడేళ్ల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, ధనియాల వంటివి సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. జిల్లాలో దాదాపు 11 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రమేశ్, ఏఈఓ మధులిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నర్సాపూర్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు విద్యార్థులు ఎంపికయ్యారని అల్లూరి సీతారామరాజు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జిల్లాలోని మాసాయిపేటలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎనిమిది మంది ఎంపికయ్యారని చెప్పారు. డిసెంబర్‌లో నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు..
- 10కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుషోత్తంరెడ్డి



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 10కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు గంజాయి విక్రయాలపై నిఘాపెట్టారు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన అరికెల శేఖర్, అదేగ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయిని నరేష్, కొండపాక మండలం సిరిసినగండ్లకు చెందిన సుక్కసారి భానుప్రసాద్‌లు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి, గంజాయి విక్రయంతో పరిసర ప్రాంతాల్లో బైకులు దొంగతనం చేశారు. అదే బైకులపై భద్రాచలం జిల్లా సీలేరుకు వెళ్లి రెండు, మూడుసార్లు గంజాయి తీసుకొచ్చి గజ్వేల్, అహ్మదీపూర్ గ్రామ పరిసరాల్లో విక్రయించారు. వీరిని ఎనిమిది నెలల క్రితం సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శేఖర్, బోయిని నరేష్‌లు సీలేరుకు వెళ్లి అక్కడ వర్ధన్ అనే వ్యక్తి వద్ద రూ.30,800 చెల్లించి 20కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఇందులో 10కిలోల గంజాయిని అరికెల శేఖర్ బస్సులో తీసుకొస్తుండగా పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నదని తెలిపారు.



రామచంద్రాపురం పట్టణంలోని జాతీయర హదారిపై ఏర్పాటు చేసిన స్వెటర్ దుకాణాలకు మంచి డిమాండ్ పెరిగింది. వారం రోజులుగా చలి మరింత పెరగడంతో స్వెటర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. 25 ఏళ్లుగా రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లకు చెందిన రైతులు ప్రతి చలి కాలంలో ఈ ప్రాంతానికి వచ్చి ఆరు నెలల పాటు ఈ వ్యాపారం నిర్వహించి తిరిగి సొంతూరు వెళ్లిపోతారు. స్వెటర్‌ల నాణ్యతను బట్టి రూ.250 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది చలి ఎక్కువగా ఉండటంతో వ్యాపారం మంచి నడుస్తుందని వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)